



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెసి రామసుందర్ రెడ్డి

అభ్యర్థిత్వం ఖరారయ్యేనా..?

- నేటి నుంచి జిల్లాలో చంద్రబాబు పర్యటన - అభ్యర్థుల ప్రకటనపై పార్టీ శ్రేణుల్లో ఆశలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి ప్రకటన చేస్తారేమోనని పార్టీ శ్రేణుల్లో ఆశలు నెలకొన్నాయి..

ఎన్నికల వాతావరణం మొదలైంది. ఈ నేపథ్యంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం పత్తికొండ, ఆదోనిలో రోడ్‌షోలు నిర్వహించనున్నారు. పత్తికొండలో నిర్వహించే బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొననున్నారు. గురువారం ఎమ్మిగనూరులో రోడ్ షో చేపట్టి బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొననున్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. మూడు రోజుల పాటు చంద్రబాబు పర్యటన నేపథ్యంలో టిడిపి తరపున పోటీ చేసే శాసనసభ అభ్యర్థుల పేర్లను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. గతంలో నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంలో టిడిపి అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. కర్నూలు జిల్లాలో కూడా కనీసం అయన పర్యటించే నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో అభ్యర్థులు ప్రకటించడం వల్ల తలెత్తే సమస్యలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులను ముందుగా వెల్లడించి వారిని ప్రజల్లోకి పంపి పార్టీ కోసం కష్టపడేలా పని చేయించాలని చంద్రబాబు భావిస్తున్నారు. యువ నాయకత్వానికి ప్రధాన అవకాశం కల్పించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం ముందు నుంచి పనిచేసే వారికి ప్రధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిజి భరత్, పాణ్యం నియోజకవర్గ అభ్యర్థిగా గౌరు చరిత రెడ్డి, కోడుమూరు నియోజకవర్గం నుంచి ఆకెపోగు ప్రభాకర్ పేర్లను దాదాపు ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కెఇ శ్యాం బాబు పేరునే దాదాపు ఖరారు చేసే అవకాశం ఉంది. శ్యాం బాబు తండ్రి కెఇ కృష్ణమూర్తి పార్టీలో కీలకంగా పని చేయడం, ఆయన వయసు రీత్యా తనయుడికే అవకాశం కల్పించనున్నారు. ఒక వేళ వైసిపి అభ్యర్థిగా కురువ సామాజికవర్గం నుంచి గోరంట్ల మాధవ్‌ను బరిలో నిలిపితే అదే సామాజిక వర్గానికి చెందిన బత్తిన వెంకటరాముడుకు టిడిపి అభ్యర్థిగా అవకాశం కల్పించాలని పార్టీ అధిష్టానం యోచిస్తోంది. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డికే అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే కోట్ల వర్గం ఎమ్మిగనూరులో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం, బివి అసమ్మతి వర్గం వారి వైపునకు వెళ్లడంతో వారు కూడా ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆదోని నియోజకవర్గ అభ్యర్థి పోటీలో ఆశావహులు ఎక్కువగా కనిపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో పాటు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మదిర భాస్కర్ రెడ్డి, గతంలో పోటీ చేసి ఓడిన గుడిసె కృష్ణమ్మ, మైనార్టీ నేత రవూఫ్ పోటీ పడుతున్నారు. మంత్రాలయం నియోజకవర్గం అభ్యర్థిగా దాదాపు తిక్కారెడ్డి పేరునే ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో చంద్రబాబును ఆయన కలిసిన నేపథ్యంలో ఆయన పేరునే ఖరారు చేసినట్లు సంబరాలు కూడా జరుపుకున్నారు. కౌతాళం మండలానికి చెందిన ఉలిగయ్య కూడా అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. అధిష్టానం ఎవరి పేరును ఖరారు చేస్తుందో వేచి చూడాల్సిందే.




ప్రతి ఒక్క కూలీకీ ఉపాధి

- అవినీతిని తగ్గించేందుకే సామాజిక తనిఖీలు
- ఉపాధి పనుల బహిరంగ సభలో డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి-తుగ్గలి

ఉపాధి హామీ చట్టంలో ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలిలో ఉపాధి పనులపై బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కూలీలు వలసలు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అవినీతి జరగకుండా ఉండేందుకే సామాజిక తనిఖీలను ఏర్పాటు చేశారన్నారు. గత రెండేళ్ల పనులకు గాను వివిధ పనులపై రూ.1,75,478 రికవరీ చేశామన్నారు. పెండేకల్లు రూ.68,474, తుగ్గలి రూ.5,596, గిరిగెట్ల రూ.10,864, కడమకుంట్ల రూ.6,949, చెన్నంపల్లి రూ.2,650, రామకొండ రూ.4,100, ముక్కెళ్ళ రూ.4,500, పగిడిరాయి రూ.9,337, జొన్నగిరి రూ .449, రాంపల్లి రూ.27,633, శభాసపురం రూ.7,181, రాంపురం రూ.3,524, రాతన రూ.15,925, ఎద్దులదొడ్డి రూ.8,285 రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పులికొండ నాయక్, ఎపిడి సలీంబాష, విజిలెన్స్ అధికారి సిద్ధ లింగమూర్తి, ఎఎస్ శోభారాణి, ఎస్ఆర్‌పి ఎస్ఆర్ మూర్తి, ఎపిఒ రామకృష్ణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేటీలు, కూలీలు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

నేడు రాజ్ విహార్ సెంటర్‌లో మానవహారం
- రాయలసీమ జెఎసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో రాష్ట్ర హైకోర్టును ఏర్పాటు చేయాలని రాయలసీమ జెఎసి నేతలు పుల్లయ్య సోమిశెట్టి వెంకటరామయ్య, విజయ్ కుమార్ రెడ్డి, నక్కలమిట్ట శ్రీనివాసులు, శ్రీరాములు, చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలులో సాయంత్రం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలు అన్ని విధాలుగా ఇప్పుడు వెనుకబడి ఉందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కర్నూలుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అంతకు ముందు ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటులో కర్నూల్ రాజధానిగా ఇక్కడనుండే పరిపాలన కొనసాగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అనంతరం రాజధానిని హైదరాబాద్‌కు తరలించారన్నారు. అలాంటిది ఇప్పుడు కర్నూలులో తప్పనిసరిగా న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలన్నారు. న్యాయ రాజధాని ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందుకు అవకాశం ఉందన్నారు. అందుకే కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు సాగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలని కోరారు. బుధవారం కర్నూలు నగరంలో వేలాది మందితో రాజవిహార్ సెంటర్ కూడలి నుండి మానవహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటాం

అభివృద్ధి, పరిపాలన వికేంద్రికరణను వ్యతిరేకిస్తూ కర్నూలులో చంద్రబాబునాయుడు ఈ నెల 16,17,18 జిల్లా పర్యటనను అడ్డుకుంటామని రాయలసీమ విద్యార్థి యువజన జెఎసి నేతలు పేర్కొన్నారు. నగరంలోని కొండారెడ్డి బురుజు మీద నుంచి నల్ల బెలూన్స్ ఎగురవేసి చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జెఎసి నేతలు సునీల్ రెడ్డి, శ్రీరాములు, చంద్రప్ప, రామినేని రాజునాయుడు, నాగరాజు, రెడ్డిపోగు ప్రశాంత్, శివ, నక్కల మిట్ట శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా కర్నూలులో న్యాయ రాజధానిని ఏర్పాటును వ్యతిరేకిస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవాలన్నారు. రాయలసీమ ప్రజలకు క్షమాపణ చెప్పి అభివృద్ధి వికేంద్రీకరణకు చంద్రబాబు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు.



కొండారెడ్డి బురుజుపై నల్లబెలూన్లను ఎగరవేస్తూ నిరసన

రీ సర్వే పనులు పక్కాగా జరగాలి

- జెసి రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రామ కంఠాల రీ సర్వేపనులు పక్కాగా రూల్స్ ప్రకారం జరగాలని జెసి ఎస్.రామసుందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మండల రెవెన్యూ అధికారులు, ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు, మండల సర్వేయర్లు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామ కంఠానికి సంబంధించిన రీసర్వే పనుల మీద జెసి ఎస్.రామసుందర్ రెడ్డి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు , భూ రక్ష పథకం క్రింద చేపడుతున్న గ్రామ కంఠాల రీసర్వే పనులలో ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా జరగాలన్నారు. గ్రామాలలో బాగా ప్రచారం చేయాలని, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నోటీసులు ప్రదర్శించాలన్నారు. ఫారమ్-2 నోటీసు జారీ చేయడం, గ్రామ సభ నిర్వహించి ప్రజలకు ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించాలన్నారు. సున్నంతో మార్కింగ్ వేసే ఒక రోజు ముందు ముళ్ళ పొదలు క్లియర్ చేసుకోవాలన్నారు. రెండు రోజులు తర్వాత డ్రోన్ కెమెరాలతో సర్వే చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 9 నుండి 2 గంటల వరకు గ్రామ కంఠాల రీసర్వే పనులు నిర్వహించాలని, తర్వాత ఏ రోజు చేసిన పనులను ఆ రోజే సాఫ్టవేర్‌లో మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. రికార్డులను కూడ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సర్వే చేసే వారం రోజుల ముందుగానే సంబంధిత యజమానికి నోటీసు ఇవ్వాలన్నారు. సర్వే చేసే సమయంలో ఆయా ఇంటి యజమానులు తప్పనిసరిగా అక్కడ ఉండేలా చూడాలని చెప్పారు. సర్వే పూర్తి చేసిన తరువాత 9(2) నోటీసులు సంబంధిత యజమానులకు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు. అందుకు సంబంధించిన అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలన్నారు.. అసెస్‌మెంట్ రిజిస్టర్‌కు సంబంధించిన 42 కాలమ్‌ను నాలుగు రకాలుగా విభజించి చేసుకోవడం వల్ల కన్‌ఫ్యూజన్ ఉండదని అన్నారు. ఈ ప్రక్రియ మొత్తం 60 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఒలు హరిప్రసాద్, మోహన్ దాస్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఎన్.మనోజ్‌రెడ్డి, జివి.రమాకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టమో'టా'

- కిలో 20 పైసలు
- గిట్టుబాటు ధర లేక టమోటాను పారపోసి రైతుల నిరసన

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండలో టమోటా ధర పతనం కావడంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. మంగళవారం టమోటా మార్కెట్లోని టమోటా కిలో 20 పైసలు పలకడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లోని వ్యాపారస్తులు సిండికేట్ అయి రైతులను మోసం చేస్తున్నారని రైతులు బోరున విలపిస్తున్నారు. జత గంప (30) కిలోలు రూ. 20 పలకడంతో రవాణా కూలి పెట్టుబడి ఖర్చులుకూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌కు పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, మద్దికెర మండలాల ప్రాంతాల నుంచి గ్రామీణ రైతులు టమోటాలు తీసుకొస్తారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

కాలువలు శుభ్రం చేయించండి

- సచివాలయ కార్యదర్శికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని రెండవ వార్డు ఖల్లా వీధిలో, కాలువలు శుభ్రం చేసి, ఏరోజు చెత్త ఆరోజు శుభ్రంగా ఎత్తి వేయాలని కోరుతూ సచివాలయం కార్యదర్శికి సిపిఎం నగర నాయకులు ఎస్ఎండి షరీఫ్, ఖాజా పాషాలు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరిపడ శానిటేషన్ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. పనికి తగ్గట్టు వర్కర్స్‌ను పెట్టుకొని వార్డులో ఏ రోజుకు ఆ రోజు చెత్త చెదారాన్ని రోడ్ల ఊడ్చుటకు, కాలువలు శుభ్రం చేయాలని కోరారు. అలా శుభ్రం చేయకపోవడం వల్ల ప్రజలకు అంటూ రోగాలు, దోమల బెడద, మలేరియా బోదకాలు వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అక్కడ నివసించే ప్రజలందరూ నిరుపేద ప్రజలు ఉన్నారని, తక్షణమే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. సచివాలయ కార్యదర్శి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తానని హామీ ఇచ్చారు. సాధిక్, తిరుమలేష్, షఫీ, అబ్దుల్ రసూల్, శివ, ఖాలీల్, మున్న పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు షరీఫ్

కొళాయి కనెక్షన్‌కు అధికారులు చేతివాటం

మద్దికెరలో ఒక్కో కనెక్షన్‌కు రూ.300 అదనపు వసూలు



ప్రజాశక్తి - మద్దికెర: ప్రజలకు సేవచేయాల్సిన అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ మద్దికెర గ్రామ పంచాయతీలో అధికారులు నిలువు దోపిడీకి పాల్పడు తున్నారు. అక్రమాలకు పాల్పడుతూ దోచుకుంటున్నారు. ఒక్కో కనెక్షన్‌కు పంచాయతీ ఫీజుగా రూ.6000 మాత్రమే తీసుకోవాల్సి ఉండగా రూ.6300 తీసుకుంటూ అవినీతికి పాలపడుతున్నారు.

బిల్ కలెక్టర్ చేతివాటం: మద్దికెర గ్రామపంచాయతీలో కొళాయి కలెక్షన్ మంజూరులో బిల్ కలెక్టర్ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. గ్రామంలోని రామ్‌నగర్‌లో ఇటీవల కుళాయి కనెక్షన్ మంజూరు చేశారు. పంచాయతీ అధికారులు ఒక్కో కనెక్షన్‌కు రూ.6000 తీసుకోవాల్సి ఉండగా రూ.6300 తీసుకుంటున్నారు. రూ.300 అదనంగా ఎందుకు అని అడిగితే ఇష్టం ఉంటే తీసుకోండి లేకపోతే లేదని తేల్చి చెబుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయం పై ప్రజాశక్తి బిల్ కలెక్టర్‌ను వివరణ కోరగా పంచాయితీకి రూ.6,000 ఫీజు తో పాటు మేంటనెన్స్ కింద రూ.300 తీసుకుంటామని చెప్పారు. పంచాయితీ కార్యదర్శి శ్రీహరిని సంప్రదించగా కుళాయి కలెక్షన్‌కు రూ.6000 మాత్రమే తీసుకోవాలన్నారు. అదనంగా వసూలు తీసుకున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గౌరీ గోపాల్ ఆస్పత్రిలో అరుదైన గుండె శస్త్ర చికిత్స

లారీ డ్రైవర్ కు ప్రాణం పోసిన డాక్టర్ లక్ష్మణస్వామి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



ఏనిమిదేళ్లుగా గుండె నొప్పితో బాధ పడుతున్న ఓ లారీ డ్రైవర్‌కు గౌరీగోపాల్ హాస్పిటల్ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ పి ఎన్ ఎన్. లక్ష్మణస్వామి ప్రాణం పోశారు. మంగళవారం గౌరీ గోపాల్ హాస్పిటల్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ లక్ష్మణ స్వామి వివరాలు వెల్లడించారు. కర్నూలు నగరం, శ్రీనివాస నగర్‌కు చెందిన గిడ్డోజి రావ్ వృత్తి రీత్యా లారీ డ్రైవర్. ఆయనకు ధూమపానం, అతిగా మాంసాహారం తీసుకోవడం అలవాటయ్యాయి. ఏనిమిదేళ్ళ కిందట గుండెలో నొప్పి, ఆయాసం రాగా వైద్యులను సంప్రదించాడు. గుండె కుడివైపు ఉన్నదని, అంతా నార్మల్ అని చెప్పారు. గత జులై నెలలో నొప్పి తీవ్రం కావడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఆ తర్వాత పుట్టపర్తి కి వెళ్ళాడు. ఇలా మందులు, ఇంజెక్షన్లతో కాలయాపన చేశాడు. దీంతో గుండె ఇంకా దెబ్బ తినింది. చివరకు ఆయనకు తెలిసిన వైద్యులు డాక్టర్ వెంకట రమణ ద్వారా గౌరీ గోపాల్ ఆసుపత్రికి వచ్చాడు. ఆంజియో గ్రామ్, 2 డి ఏకో చేసి, ఆరోగ్యశ్రీలో ఉచిత ఆపరేషన్ చేశాం. గుండె కుడి వైపున ఉండడాన్ని డెక్స్ట్రో అని అంటారు. అవయవాలు కుడి వైపువి ఎడమకు, ఎడమవైపువి కుడికి ఉండడాన్ని సైటస్ ఇన్వర్సేస్ అంటారు. ఇలాంటి పరిస్థితి ప్రతి 12,000 లో ఒకరికి ఉంటుంది. రోగికి ఆపరేషన్ బీటింగ్ హార్ట్ పద్ధతిలో చేశామని రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ స్వామి విలేకరులకు వివరించారు. కర్నూలు నగరానికి చెందిన గిడ్డోజి రావుకు గౌరీ గోపాల్ హాస్పిటల్ వైద్యులు సకాలంలో గుండెకు శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. సమావేశంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ మాల కొండయ్య, అనస్తీసియా డాక్టర్ ఖాద్రీ, ఆసుపత్రి ఎండి డాక్టర్ శివ శంకర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల ద్వారా విజ్ఞానవంతులు కావాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలని డిఆర్ఒ ఎస్‌వి.నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు 55వజాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు పుస్తక ప్రదర్శన , నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఆర్ఒ ఎస్‌వి నాగేశ్వరావు పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. డిఆర్ఒ నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వెళ్లి సభ్యత్వం తీసుకోవాలన్నారు. ఇక్కడ ఉండే పుస్తకాలను బాగా చదువుతూ ఇంటికి తీసుకుని వెళ్లి వాటిలోని జ్ఞాన సారాంశాన్ని గ్రహించి విజ్ఞానవంతులు కావాలన్నారు. చదువుతో పాటు సంస్కారాన్ని నాగరికతను నేర్చుకోవాలంటే గ్రంథాల యంలోని పత్రికలను పుస్తకాలను తప్పకుండా చదవాలని ధనవంతులు కావాలని సూచించారు. సంస్థ అధ్యక్షులు సుబాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రజల వద్దకు గ్రంథా లయాన్ని చేరువయ్యేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. సంస్థ మాజీ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర ,గంగాధర్ రెడ్డి , కార్యదర్శి కె.ప్రకాష్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి వి. పెద్దక్క , సహాయ గ్రంథాలయాధికారి వజ్రాల గోవిందరెడ్డి, గ్రంథాలయ అధికారులు ఎస్.బాష, చంద్రమ్మ ,నసీమాబీ, రికార్డు అసిస్టెంట్లు ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, అటెండర్లు ఉమా, భాస్కర్ ,ఆఫీస్ సిబ్బంది మగ్బుల్‌బాష, రాజు, సుదర్శన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు ప్రజలు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డిఆర్ఒ ఎవి నాగేశ్వరరావు, ఛైర్మన్ సుభాస్ చంద్రబోస్

వినాయక డిగ్రీ కళాశాలలో గ్రంధాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -సి బెళగల్

సి.బెళగల్‌లోని వినాయక డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్ వెంకటరమణ మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ కాంతన్న అధ్యక్షతన గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠకులకు, పుస్తక ప్రియులకు పుస్తక పఠనంపై అవగాహన క్షేత్రస్థాయిలో చేపట్టారు. డ్రగ్స్ మహమ్మారికి యువత దూరంగా ఉండాలని భవిష్యత్తులో మంచిమార్గం ఎంచుకువాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు.

ఎస్‌సి రిజర్వేషన్లలో పార్టీల దోపిడీకి అడ్డుకట్ట

షెడ్యూల్డ్ కులాల జెఎసి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ఎస్‌సిరిజర్వేషన్లలో రాజకీయ పార్టీల దోపిడీని అడ్డుకోవాలని షెడ్యూల్డ్ కులాల జెఎసి నాయకులు అన్నారు. మంగళవారం కర్నూలు రాజ్ విహార్ సెంటర్‌లోని అంబేద్కర్ భవనంలో దళిత సంఘాల జెఎసి సమావేశాన్ని వారు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్ అధ్యక్షత వహించారు. ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ, హైకోర్టు న్యాయవాది ఎగ్గోని జయరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాస్, మాలవిద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్, రాయలసీమ మాదిగ దండోర అధ్యక్షులు అనంతరత్నం మాదిగ, దళితసేన రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు బజారన్న, ఎపిఎస్‌సి వెల్ఫేర్ అసోషియేషన్ జిల్లాఅధ్యక్షుడు విఎం.వెంకటేశ్వర్లు, సంజీవకుమార్, నంది కొట్కూరు కాంగ్రెస్ ఇంఛార్జి చెరుకు అశోకరత్నం, కోడుమూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి దామోదరం రాధాకృష్ణ, దళిత బహుజన సమితి అధ్యక్షురాలు వేల్పుల జ్యోతి, మాదిగ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు గోపి, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు సోమ సుందరం, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగేశ్వరి మాట్లాడుతూ ఎపిలోని రాజ్యాంగ పరంగా షెడ్యూల్ కులాలకు ఏర్పాటు చేసిన 15 శాతం రిజర్వేషన్లలో దోపిడీ చేసేందుకు రాజకీయ పార్టీలు వారి ప్రయోజనాల కోసం కుల వివక్షత, అంటరాని తనం లేని బిసిలుగా చలా మణి అవుతున్న కొన్ని కులాలను ఎస్‌సి జాబితాలో చేర్చుతామని చెప్పడం దారుణమన్నారు. ఎన్నికల హామీల అమలు పేర ఎపి ప్రభుత్వం నవంబర్2న సాంఘిక సంక్షేమశాఖ ద్వారా మాదాసి మాదారి కురుభ కులాన్ని ఎస్‌సిలుగా గుర్తించాలని జీవో నెం.53ను జారీ చేసిందన్నారు. 53 జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఎటువంటి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయవద్దని గతంలో ప్రభుత్వం నియమించిన జెసి.శర్మ వన్‌మెన్ కమిషన్ సూచించిందన్నారు. ఏడు కులాల వారు భోగస్ సర్టిఫికేట్స్ పొందుతున్నారని వారు ఎస్‌సిలు కాదని కమషన్ స్పష్టంగా నివేదిక సమర్పించిందని అన్నారు. కర్నూలులోని జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలియజేస్తామని జెఎసి నాయకులు తెలిపారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న షెడ్యూల్డు కులాల జెఎసి నేతలు

ఘనంగా ముగిసిన పాలిటెక్ ఫెస్ట్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



బహుమతి ప్రదానం చేస్తున్న కెవి.సుబ్బారెడ్డి

రాయలసీమ రీజినల్ పాలిటెక్నిక్ కళాశాలల 2022-ఫెస్ట్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ ఫెస్ట్‌లో ఉత్త ప్రదర్శన ఇచ్చిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కర్నూలులోని డాక్టర్ కెవి. సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ప్రాంతీయ పాలిటెక్నికల్ 2022 ఫెస్ట్ ప్రారంభమైంది. ఆయా కళాశాలలు ప్రదర్శించిన మోడల్స్‌ను బట్టి న్యాయ నిర్ణేతలు ఈ కింది కళాశాలకు చెందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.25 వేలు ఇఎస్‌సి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నంద్యాల సాధించింది. రెండవ బహుమతిగా రూ.10వేలు డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ సాధించింది. ఈ ముగింపు కార్యక్రమనికి కళాశాల చైర్మన్ డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ప్రభుత్వ సాంకేతిక విద్య డిప్యూటీ సెక్రటరీ ఎ.రవి కుమార్, ప్రిన్సిపల్ కె.కన్న కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.విజయకుమార్ , కర్నూలు , నంద్యాల జిల్లాల ప్రభుత్వ ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

అత్యాధునిక పరికరాలతో జెరూష కిడ్నీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



అత్యాధునిక లేజర్ పరికరాలు , యురాలజీలో 22 ఏళ్ల అనుభవం కలిగిన డాక్టర్ ఆండ్రూస్ జేసుదాస్ నూతన హాస్పిటల్‌ను ప్రారంభించారు. స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని జెరూష కిడ్నీ మల్టీ స్పెషాలిటీ , ఇన్‌ఫర్టిలిటీ సెంటర్‌ను నూత నంగా ,అత్యాధునిక పరికరాలతో పునః ప్రారంభించారు. ఆధునిక వైద్యం కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇప్పుడు మన కర్నూలులోని జెరూష కిడ్నీ , ఇన్‌ఫర్టిలిటీ సెంటర్లో స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా అపార అనుభవం గడించిన డాక్టర్ ఆండ్రూస్ జేసుదాస్ అధునాతన పద్ధతిలో కిడ్నీ సంబంధిత వ్యాధులకు చికిత్స చేయనున్నారు.

హాస్పిటల్‌ప్రత్యేకతలు : టియుఆర్‌పి, యుఆర్ఎస్ఎల్, పిసిఎన్ఎల్ లతో ట్రిప్సి, లాప్రోస్కోపి, మూత్రపిండం , మూత్ర సంచి క్యాన్సర్లకు చికిత్స, చిన్నపిల్లల మూత్ర సంబంధ వ్యాధులకు చికిత్స,సెక్స్ బలహీనతలు, సంతానలేమికి చికిత్సలు , యూరాలజీ సంబంధమైన అన్ని రకాల ఆపరేషన్లు చేస్తారు. కిడ్నీలో రాళ్లకు ఎటువంటి కోత , కుట్టు లేకుండా ఆపరేషన్ చేస్తారు. హాస్పిటల్‌లో రెండు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, వెంటిలేటర్ ఐసియులు ఉన్నాయి. **హాస్పిటల్ అడ్రస్:** పాత నటరాజ్ టాకీస్ కాంపౌండ్ ,ధర్మపేట్ రోడ్, కర్నూలు సెల్: 9666975755

'సంక్షేమానికే' జగన్ ప్రభుత్వం పరిమితం

- వ్యకాస జిల్లా అధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



సమావేశంలో మాట్లాడుతున్న లింగన్న

వలసలు నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, సంక్షేమ పథకాల గొప్పలు చెప్పుకోవడానికి సరి పోయిందని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.లింగన్న, జిల్లా సహాయ కార్యదర్శి తిక్కన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు విమర్శించారు. మంగళవారం మండలంలోని పాండవగల్లు పాతూరు ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర వ్యకాస 9వ మండల మహాసభ నిర్వహించారు. ఉచ్చీరప్ప అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడారు. అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిని రైతు నష్టపోయారని తెలిపారు. పనుల్లేక వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. మండలంలోని పాండవగల్లు, బల్లేకల్లు తదితర గ్రామాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలకు నేటికీ ఇవ్వలేదన్నారు. భవిష్యత్తులో భూమి, ఇళ్ల స్థలాలు, ఇల్లు సమస్యల పరిష్కారానికి వ్యకాస పోరాడుతుందని తెలిపారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రంగనాథ్, కార్యదర్శిగా డి.రామాంజనేయులు, మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు, సిఐటియు నాయకులు పాండురంగ, రైతు సంఘం నాయకుల హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో విజయం సొంతం

- ఐఎఎస్ ర్యాంకర్ అంబికా జైన్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



అంబికా జైన్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

విద్యార్థులు లక్ష్యం ఉన్నతంగా నిర్దేశించుకుంటే ఎంతటి విజయాలైనా సాధించవచ్చని ఐఎఎస్ ర్యాంకర్ అంబికా జైన్ తెలిపారు. మంగళవారం వైష్ణవి డిగ్రీ కళాశాలలో జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని సమయపాలనతో నిత్యం కష్టపడితే ఇంతటి విజయాన్నయినా సాధించవచ్చని తెలిపారు. వైష్ణవి కళాశాలతో తనకెంతో అనుబంధం ఉందని, హైస్కూల్ విద్యార్థి దశలో ఉన్నప్పుడు కళాశాలలో జరిగే ప్రతి కార్యక్రమానికీ హాజరయినట్లు చెప్పారు. యాజమాన్య కుటుంబ సభ్యులకు తమ కుటుంబ సభ్యులకు ఎంతో అవినాభావ బంధం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలని, కొన్ని సాధించుకోవాలంటే విద్యార్థి దశ వయస్సులో సుఖాలు వదులుకోవాలని తెలిపారు. అప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతామని చెప్పారు. తనను ప్రేరణగా తీసుకొని ఒక్కరైనా ఐఎఎస్ అయితే తనకెంతో సంతోషమని తెలిపారు. కళాశాల ఛైర్మన్ జీడి లింగప్ప, కరస్పాండెంట్ జి.సత్యశ్రీ, డైరెక్టర్ గంగన్న, ఐఎఎస్ ర్యాంకర్ తండ్రి జైన్, డిగ్రీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధుబాబు, మునెప్ప పాల్గొన్నారు.

'గులాబీ' పురుగు నివారణకు 'పిబి నాట్'

- శాస్త్రవేత్త శివ రామకృష్ణ

ప్రజాశక్తి - కౌతాళం



శివరామకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సభ్యులు

పత్తి పంట సాగులో గులాబీ రంగు పురుగు నివారణకు 'పిబి నాట్' ఉత్తమమైనదని నంద్యాల ప్రాంతీయ పరిశోధన శాస్త్రవేత్త శివరామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పత్తి పంట సాగులో గులాబీ రంగు పురుగు వల్ల రైతులు నష్టాల పాలవుతున్నారని తెలిపారు. ఈ పురుగు నివారణ కోసం పిఐ కంపెనీ వారు తయారు చేసిన 'పిబి నాట్' పద్ధతి ద్వారా రైతులు పంటను కాపాడవచ్చని చెప్పారు. ఈ పద్ధతిలో గ్రామానికి చెందిన ఏకం రెడ్డి 50 ఎకరాల్లో పంటలు సాగు చేసి మంచి దిగుబడి సాధించినట్లు తెలిపారు. రైతులు గులాబీ రంగు పురుగు నివారణ కోసం ఇలాంటి పద్ధతుల ద్వారా వ్యవసాయ రంగంలో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. పిఐ కంపెనీ వారు ఎంఎం.నాగార్జున రెడ్డి, మేనేజర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'18న మండల సర్వసభ్య సమావేశం'

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఈనెల 18న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శ్రీవిద్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ వెంకట రమణప్ప మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జడ్‌పిటిసి, వైస్ ఎంపిపిలు, కోఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు. అలాగే ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

'మైనర్ ఇరిగేషన్'లో.. అధికారులు ఎవరో..?

- కార్యాలయానికి రాని సిబ్బంది - శిథిలావస్థకు చేరిన భవనం - రికార్డు గదిలోకి మార్పు...

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



శిథిలావస్థకు చేరిన కార్యాలయం...

పట్టణంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి పక్కన ఉన్న మైనర్ ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముందు భాగంలో భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వెనుక భాగంలో ఉన్న రికార్డు గదిలో విధులు నిర్వహించేందుకు అక్కడకు మార్చుకున్నారు. ఆ కార్యాలయం కూడా తరచూ వర్షాకాలంలో కారుతూ, పైభాగం నుంచి మట్టి ఎప్పుడూ కిందికి పడుతూనే ఉంటుంది.

ఆదోని మండలంతో పాటు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి, హోళగుంద, హాలహర్వి మండలాల నుంచి వివిధ పనుల నిమిత్తం మండలాలు, గ్రామాల నుంచి కార్యాలయానికి వస్తూ ఉంటారు. ఈ కార్యాలయంలో ఒక డిఇ, ముగ్గురు ఎఇలు విధులు నిర్వహించాల్సి ఉంది. ఇక్కడ ఒక ఎఇ, ఒక డిఇ మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈ కాలంలో ఒక జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ ఉన్నప్పటికీ అప్పుడప్పుడు జూనియర్ అసిస్టెంట్ మాత్రమే వస్తుంటారని సమాచారం. ఇక్కడ పని చేస్తున్న కిందిస్థాయి సిబ్బందిని అడిగితే మాత్రం ఎప్పుడూ అధికారులు క్యాంపులో ఉంటారని సమాధానం ఇస్తూ ఉంటారు. కార్యాలయంలో పని చేసే అధికారులు ఫోన్ నెంబర్లు కూడా దొరకడం కష్టంగా ఉందని వివిధ గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. డిఇ మాత్రం వారానికి ఒక్కసారి కూడా రాని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి నూతన కార్యాలయం ఏర్పాటు చేయాలని, అధికారులు సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలని మండల, గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విశ్వనాథరెడ్డి

పుస్తకాలు చదివి జ్ఞానం పెంచుకోండి

- గ్రంథాలయ అధికారి విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - ఆస్పరి

పుస్తకాలు చదివి జ్ఞానం పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు. మంగళవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా ఆస్పరి, బిణిగేరి, తురువగల్లు ప్రధానోపాధ్యాయులు జోతిమూర్తి, నాగేంద్రప్ప, వెంకటరమణ పాల్గొని పుస్తక పఠనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. యువతకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయని చెప్పారు. ఆధునిక యుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తిమ్మప్ప, పాఠకులు మహేష్, నరసింహులు, మహేష్, చరణ్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని గ్రంథాలయంలో పుస్తక పఠనం చేపట్టారు. గ్రంథాలయ అధికారిని మధులీల మాట్లాడుతూ... రోజూ దినపత్రికలు చదవడం వల్ల ప్రపంచంలోని నలుమూలల సమాచారాన్ని తెలుసుకోగలరన్నారు.



విద్యార్థి సమస్యలపై రాజీలేని పోరాటం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం, సామాజిక విషయాలపై అవగాహన కలిగి విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప తెలిపారు. బుధవారం గోనెగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'నూతన జాతీయ విద్యా విధానం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వీరన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను వ్యాపారం చేస్తూ ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరణ చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ఈ విధానం గురించి పునరాలోచించుకోవాలని, లేకపోతే భారీ ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎన్.ఖాజా, కార్యదర్శిగా వీరన్నతో పాటు మరో 25 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు, మండల నాయకులు రామన్, చంద్రపాల్, బాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు నందికుమార్, సలీం, మురళీ, మంజునాథ్, మోహన్ పాల్గొన్నారు.

'కార్మికులకు యూనిఫారం ఇవ్వాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు యూనిఫారం, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వాలని సిఐటియు డివిజన్ నాయకులు రాముడు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు (సిఐటియు, ఎఐటియుసి) నాయకులు సాల్మన్, ఎల్లప్ప కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెగ్యులర్ కార్మికులతో పాటు శానిటేషన్ పనులు చేసే అన్ని రకాల మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు యూనిఫారం, సబ్బులు, కొబ్బరి నూనె ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు సోమన్న, పెద్ద రంగన్న, ముక్తార్, మారేష్, గిడ్డయ్య, జయరాజు, బాలరాజు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

- టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కరివేముల గ్రామం నుంచి దేవనకొండ వరకు బుధవారం నిర్వహించే భారీ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ కోరారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పత్తికొండలో జరిగే 'బాదుడే... బాదుడు' కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జి కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు బడి గింజల రంగన్న, ఉచ్చీరప్ప, మలకన్న, మల్లయ్య, రామారావు నాయుడు, డీలర్ బండ్లయ్య, ఆకుల వీరేష్, వెంకటస్వామి గౌడ్, పట్టణ అధ్యక్షులు మస్తాన్, మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, రామదాసు గౌడ్, పెద్దయ్య, నాగేష్, రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లో వలసలను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ విమర్శించారు. మంగళవారం గోనెగండ్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో టిసిఎస్ విధానం బదులుగా ఎన్ఐసి విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల కూలీలకు ఏం పని చేస్తున్నామో, ఎంత పని చేస్తున్నామో తెలియడం లేదని తెలిపారు. కనీస వేతనం రోజుకు రూ.257 అని చెప్పినా ఎంత వేతనం వస్తుందో తెలియక కూలీలు అయోమయానికి గురవుతున్నారని చెప్పారు. వేసవిలో వలసలు వెళ్లకుండా ఉపాధి కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ చట్టం కింద రెండు పూటలా పని చేయాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం వల్ల గ్రామాల్లో కూలీలు నిరాసక్తితో వలసల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

ఉపాధి హామీ పరిరక్షణకు దేశవ్యాప్త కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

డిసెంబర్ 2, 3న వ్యకాస జిల్లా మహాసభలు కోడుమూరులో జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేరళ ఎంపీ శివ దాసన్ హాజరు కానున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు ఆయన నేతృత్వంలో దేశవ్యాప్త కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

సమయానికి బస్సు నడపాలి

- ఆర్‌టిసి డిపో ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - ఆదోని

పెద్దహరివాణం, సంతేకుడ్లూరు గ్రామాలకు సమయానికి బస్సు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌టిసి డిపో ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దహరివాణం, సంతేకుడూరు గ్రామాలకు సకాలంలో బస్సు రాకపోవడంతో తరగతులకు ఆలస్యంగా హాజరు కావాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి గ్రామానికి ఉదయం, సాయంత్రం కళాశాల సమయానికి అనుగుణంగా విద్యార్థి బస్ నడపాలని కోరారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు నాగరాజు, గౌస్, గణేష్, రాజు, పవన్ పాల్గొన్నారు.

వైసిపి మాటలు కోటలు దాటాయి... పనులు గడప కూడా దాటవు...

- జనసేన ఇన్‌ఛార్జి వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు



వైసిపి ప్రభుత్వం అధికారంలో రాకముందు మాటలు కోటలు దాటాయని, అధికారంలోకి వచ్చాక చేసే పనులు గడప కూడా దాటడం లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెర్నేకల్ వెంకప్ప విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతి నిర్మాణం కోసం భూసేకరణకు ఒప్పుకున్న జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు మాట మార్చి మూడు రాజధానులు అనడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జగనన్న కాలనీ ప్రజల కన్నీళ్లని, 2020 డిసెంబర్‌లో 28 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడతామని హామీ చేసిన ప్రభుత్వం 2022 అక్టోబర్ నెలకు 21 లక్షలు అయ్యాయని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 21,279 ఇళ్లు మంజూరు చేస్తే, నిర్మాణం మొదలైనవి 20,125, పూర్తయినవి 1,489 ఇళ్లు మాత్రమే అని చెప్పారు. ఆలూరు నియోజకవర్గంలో 2,690 ఇళ్లు మంజూరు కాగా 25 మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. ఇళ్లస్థలాల్లో ముళ్లకంపలు, నీరు చేరి గుంతలు ఏర్పడుతున్నాయన్నారు. వైసిపి మాటలు కాకుండా చేతల్లో చూపాలని డిమాండ్ చేశారు.

'విద్యార్థులు పోటీతత్వం అలవరచుకోవాలి'

ఆదోని : విద్యార్థులు పోటీతత్వం అలవరచుకుంటే లక్ష్యాలను సాధించవచ్చని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రహ్లాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ స్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'కథలు చెప్పుట' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న కథను నేర్చుకొని చూడకుండా ఆసక్తి కలిగించే విధంగా చెప్పి ప్రతిభను చాటుకోవడం హర్షనీయమన్నారు. విద్యార్థుల్లో పఠనాభిలాషను పెంచేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పుస్తకాలు బహుమతులుగా అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు రామయ్య తెలిపారు. ఈ పోటీల్లో శివ మారుతి, రంజిత్, దీపిక, ఐశ్వర్య, సాగర్, ప్రజ్ఞా, దీపికలు ప్రథమ బహుమతులు అందుకోగా మరో 10 మంది ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. సీనియర్ ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్, జాన్, అనిల్, పద్మబాయి, కోటన్న, పరిమళ, లోక్య నాయక్, కల్యాణ్, శ్వేత బాయి, అంకి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సచివాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సచివాలయ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టుదారులకు ఎంపిపి జూటూరు హేమలత సూచించారు. మంగళవారం బెల్డోన గ్రామంలో నిర్మిస్తున్న సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపడుతున్న ప్రభుత్వ నిర్మాణాలు సచివాల యం, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ క్లినిక్‌లు పూర్తయితే రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నిర్మాణాలకు వ్యవధి లేకుండా ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తోందన్నారు. వైసిపి మండల యువ నాయకులు మారయ్య పాల్గొన్నారు.

ఆలూరులోనే హెచ్ఐవి బాధితులకు సేవలు

- డాక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి

ఆలూరు : హెచ్ఐవి బాధితులకు మందులు, రక్తపరీక్షల సేవలు, ఎఆర్‌టి సేవలు ఆలూరు ప్రభుత్వాస్పత్రిలోనే అందుబాటులో ఉంటాయని డాక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలూరు ప్రభుత్వాస్పత్రిలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవి బాధితులకు ఎఆర్‌టి మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవి ఉన్న గర్భిణులకు ప్రత్యేక ఎఆర్‌టి సేవలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం అధికారి అలీ హైదర్ మాట్లాడారు. హెచ్ఐవి బాధితులు ప్రతినెలా ఆదోని, కర్నూలుకు ఆర్థిక ఇబ్బందులతో, ప్రయాసపడి వెళ్లకుండా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ కుమార్ ఆదేశాల మేరకు ఆలూరు ప్రభుత్వాస్పత్రిలో శిబిరం నిర్వహించి ఆలూరు, హాలహర్వి బాధితులకు ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించనున్నట్లు తెలిపారు. బాధితులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు, మందులు వినియోగించుకోవాలని సూచించారు. ఎఆర్‌టి డాక్టర్ దినేష్, ల్యాబ్ టెక్నీషియన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్
- గోడౌన్ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - ఆస్పరి

రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య తెలిపారు. మంగళవారం ఆస్పరి రామతీర్థం సమీపంలో మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోడౌన్ నిర్మాణానికి సొసైటీ సెక్రటరీ అశోక్ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆస్పరి మండలానికి 500 మెట్రిక్ టన్నుల రెండు గోడౌన్లను రూ.80 లక్షలతో నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే చిగిలి, జొహరాపురం, చిన్నహోతూరు గ్రామాల్లో గోడౌన్లను నిర్మిసున్నామని చెప్పారు. రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచుకోవడానికి ఈ గోడౌన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులకు సున్నా వడ్డీ రుణాలు, రైతు భరోసా, ధరల స్థిరీకరణ నిధి లాంటి పథకాలను ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతుల బాంధవుడు అయ్యారని తెలిపారు. జడ్‌పిటిసి దొరబాబు, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, రంగన్న, వైసిపి నాయకులు తిమ్మప్ప, ప్రకాష్, శ్రీరాములు, విజయ్ కుమార్, రామాంజనేయులు, వీరేంద్ర, సూపర్‌వైజర్ బాలరాజు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న నాయకులు

సూపర్‌స్టార్ కృష్ణకు ఘననివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రముఖ నటుడు సూపర్‌స్టార్ కృష్ణకు అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు వహాబ్, ఎంఎస్.వాస్, పరమేష్‌లు కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నటుడు కృష్ణ మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని తెలిపారు. 350కి పైగా సినిమాల్లో హీరోగా నటించిన నటుడు కృష్ణ అని గుర్తుచేశారు. తెలుగు సినిమా పరిశ్రమలో అనేక ప్రయోగాలతో ఆయన నూతన ఒరవడిని సృష్టించారని చెప్పారు. తెలుగు సినిమా పరిశ్రమకు 50 ఏళ్ల పాటు సేవలు అందించిన కృష్ణ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఎమ్మిగనూరు నుంచి రెండు వాహనాల్లో కృష్ణ అంతిమయాత్రలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పరమేష్, శ్రీనివాసులు, నరసప్ప, మధు, నారాయణ, రెహ్మాన్, నాగరాజు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి : మండలంలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో క్షేత గుడి చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఓ మహిళ దగ్గర కర్ణాటక మద్యం ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లు 280, కింగ్ ఫిషర్ 30 సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. రామకృష్ణ, షేక్ మహ్మద్ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలను పరిష్కరించండి'

చిప్పగిరి : ప్రజల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు తెలిపారు. మంగళవారం మండలంలోని నేమకల్లు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి, విధులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సచివాలయాలకు వచ్చిన ప్రజలకు సరయిన సమాధానాలు అందించి, వారికి అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. రోజూ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు 'స్పందన'ను నిర్వహించాలని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించి, ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండలంలో సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి బాలన్న పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆల్ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సామాజిక కార్యకర్త, వికలాంగుల సంక్షేమ సంఘాల గౌరవాధ్యక్షులు, మల్లెల గ్రూపు అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... పట్టణంలోని పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న దర్గా వద్ద కొద్ది రోజులుగా గుర్తు తెలియని మహిళ ఉంటున్నారు. ఆమె మానసిక స్థితి సరిగ్గా లేదు. ఆమె ఒంటిపై సరైన బట్టలు లేక, వేళకు అన్నపానియాలు దొరకడం లేదు. రాత్రి వేళల్లో కనీసం కప్పుకునేందుకు దుప్పట్లు కూడా లేని దుస్థితి. కొన్ని రోజులుగా ఆ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్న మాచాని రామప్ప స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరమ్మ, ఆమె కుమారులు గుర్తించి ఆమెకు కొన్ని రోజులుగా బట్టలు, ఆహారం, దుప్పట్లు అందించారు. ఇక్కడ ఈ మహిళ మానసిక వ్యాధిగ్రస్తురాలు కావడంతో ఈమెకు ఇచ్చిన దుస్తులు, దుప్పట్లు పోగొట్టుకున్నారు. ఈమె దుర్భర స్థితిని చూడలేక మల్లేశ్వరమ్మ, ఆమె కుమారులు పట్టణంలోని మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సంబంధిత పట్టణ పోలీసు స్టేషన్‌లోని మహిళ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వరికి ఈమెకు సంబంధించిన వివరాలు తెలియజేశారు. హెడ్ కానిస్టేబుల్ సహకారంతో ఆదోనిలో గల పాస్టర్ ఫిలిప్ ఆధ్వర్యంలో నడుస్తున్న జీవన జ్యోతి అనాథాశ్రమంలో ఆమెను చేర్పించారు. ఈ మహిళ పేరు రామలక్ష్మిగా పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిస్తే చెప్పాలని, వారి కుటుంబ సభ్యులకు ఈమె ఆచూకీ తెలియజేయండని కోరారు.



మహిళలను చేరదీసిన మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు

మార్చి చివరి వరకు సాగునీరు

- తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షులు రామిరెడ్డి

ప్రజాశక్తి - హోళగుంద



సమావేశంలో మాట్లాడుతున్న రామిరెడ్డి

ఎల్ఎల్‌సి కాలువకు మార్చి చివరి వరకే సాగునీరందిస్తున్నట్లు బోర్డు అధికారులు సమాచారం అందించారని తుంగభద్ర బోర్డు రైతుసంఘం అధ్యక్షులు తప్పెట రామిరెడ్డి తెలిపారు. ఈ ఏడాది రైతులందరూ ఆరుతడి పంటలు వేసుకుని అధికారులకు సహకరించాలని రైతులను కోరారు. మంగళవారం స్థానిక వాల్మీకి సర్కిల్ రైతు భరోసా కేంద్రంలో ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం మోకా క్షేత్రం దగ్గర వేదవతి నదిలో నిర్మించిన ఎల్ఎల్‌సి వంతెన దెబ్బ తినడంతో వంతెన మరమ్మతుల నిమిత్తం ముందుగానే 2023 మార్చి చివరి నాటికి ఎల్ఎల్‌సి కాలువకు నీటిని నిలిపేస్తున్నట్లు అధికారులు తెలిపారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలకే పరిమితమవుదామని రైతులను కోరారు. మిరప, పత్తి అధిక వర్షాలు, వివిధ తెగుళ్ల కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందించాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ విత్తనాల వల్ల చాలా మంది రైతులు నష్టపోయారని చెప్పారు. విత్తనాలు నకిలీవా, మంచి గుర్తించాల్సిన ల్యాబ్ శాస్త్రవేత్తలు, చెట్టు బాగా పెరిగిందా పూత బాగా పట్టిందా అని నిర్ధారణకు వచ్చాక మంచి విత్తనాలని చెప్పడం సరికాదన్నారు. పంట పూర్తిగా చేతికి వచ్చినప్పుడే మంచి విత్తనాలుగా రైతులు భావిస్తారన్నారు. తుంగభద్ర బోర్డు గౌరవాధ్యక్షులు గాలి వీరభద్ర గౌడ్, రైతు సంఘం నాయకులు కృష్ణయ్య, గవి సిద్ధన గౌడ్, అమరప్ప పాల్గొన్నారు.

రక్తదాన అపోహలపై నివృత్తి

- అన్ని రకాల రక్తం అందుబాటులో

- ఎడిపి వాలంటీరు, బ్లడ్ సెంటర్ అధ్యక్షులు జగన్

ప్రజాశక్తి - ఆదోని



రక్తదానం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్న అపోహలను నివృత్తి చేసి దాతలను కూడా భాగస్వాములను చేస్తూ సేవలందిస్తున్నామని ఎడిపి వాలంటీరు, బ్లడ్ సెంటర్ అధ్యక్షులు జగన్ తెలిపారు. మంగళవారం ఆదోని బ్లడ్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. పట్టణంలో సెంటర్ ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్నా అనతి కాలంలోనే అన్ని రకాల బ్లడ్ గ్రూపులను అందిస్తున్నట్లు తెలిపారు. ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల్లో 160 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు అవసరమున్న రక్తాన్ని ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. బ్లడ్ సెంటర్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు అన్ని రకాల బ్లడ్ గ్రూపులు అందుబాటులో ఉంచామని తెలిపారు. గతంలో బ్లడ్ కోసం కర్నూలు, బళ్లారి దూర ప్రాంతాలకు వెళ్లే వారని, ప్రస్తుతం తమ సెంటర్‌లోను ఆధునిక మిషనరీ ద్వారా శుద్ధి చేసి, నిల్వ ఉంచి అందిస్తున్నామని చెప్పారు. ఓల్ బ్లడ్, ఫ్రెష్ బ్లడ్, ప్యాకెట్ సేల్స్, పిఆర్‌పి, ఆర్‌డిపి, ఎఫ్ఎఫ్‌పి, డెంగీ తదితర సింగిల్ డోనెట్ ప్లేట్ లెట్స్ అందుబాటులో ఉంచామన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఆస్పత్రుల సౌజన్యంతో ఉచిత బ్లడ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అన్ని రకాల రక్తం సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఆదోని చుట్టుపక్కల ప్రాంతాల వైద్యులు సహకారంతో తమ సెంటర్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




నందికొట్కూరులో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

జాడలేని ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- రైతులను దోచుకుంటున్న దళారులు
- గిట్టుబాటు ధర కోసం రైతుల ఎదురుచూపు


వెంగళ్ రెడ్డి పేట గ్రామంలో వరి ధాన్యంను కొనుగోలు చేస్తున్న దళారులు

ప్రజాశక్తి-బండి ఆత్మకూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రైతన్నల సంక్షేమం కోసం ధరల స్థిరీకరణ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీలు ఇచ్చి గ్రామైక్య సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తి అవుతున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడం లేదు..

ధాన్యం పండించడంలో బండి ఆత్మకూరు మండలం ముందు వరుసలో ఉంటుంది. 20వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తారు. ఎకరాకు 30 క్వింటాళ దిగుబడి వస్తుంది. నంద్యాల సోనా, కర్నూలు సోనా రకాల వరిని పండిస్తారు. గత సంవత్సరం మండలంలో గ్రామైక్య సంఘాల కేంద్రాల ద్వారా మండలంలో కొనుగోలు చేశారు. ఈ ఏడాది పంట కోస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడం లేదు. మండలంలోని ఈర్నపాడు, వెంగల్‌రెడ్డిపేట, ఏ కోడూరు, బి కోడూరు, బండి ఆత్మకూరు గ్రామాల్లో వరి పంట చేతికి వచ్చి వరి ధాన్యం రైతుల ఇంటికి చేరుతున్న వేళ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు అడ్రస్ లేకపోవడంతో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. మండల వ్యాప్తంగా 20 శాతం పంటను ఇప్పటికే కోశారు. ఇటీవల తుఫాన్లు రావడంతో వరి ధాన్యాన్ని కల్లాలలో అరబెట్టాలంటే వర్షం కారణంగా తక్కువ ధరకే దళారులకు కట్టబెడుతూ రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాల ఊసే లేకుండా ఉండడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకే అమ్ముతూ తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనకపోవడంతో బస్తా రూ.1400కే దళారులకు అమ్మేయాల్సి వస్తోంది. ప్రభుత్వ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు వాతావరణం అనుకూలించి దిగుబడి బాగా వచ్చిందని ఆ వచ్చిన దిగుబడిని సక్రమంగా ధరకు అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాలు లేవని దళారులు చెప్పినట్లే అమ్ముకోవాల్సి వస్తుందని రైతన్నలు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులను, ప్రభుత్వ అధికారులను రైతన్నలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అడుగుతున్నా స్పందించడం లేదని రైతులు చెబుతున్నారు. పండించిన ధరకు సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడం దళారీ వ్యవస్థను రూపుమాపి రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉండి రైతన్నను నష్టాలు ఊబిలోకి వెళ్లేలా చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, పండించిన వరి ధాన్యాన్ని గోదాములో నిల్వ చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పనిగా తయారైందని కల్లాలో ఆరబోద్దామంటే ప్రకృతి కన్నెర చేస్తుందని రైతన్నలు ఆపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నుండి గట్టెక్కించాలంటే ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలో ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతన్నలు కోరుతున్నారు.

దళారుల ప్రమేయం లేకుండా చేయాలి



రైతన్నలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారానే ప్రభుత్వం సేకరించాలి. దళారుల ప్రమేయం లేకుండా నియంత్రిం చాలి. గిట్టుబాటు ధర కల్పించాలి. ప్రస్తుతం మండలంలో కొనుగోలు కేంద్రాలు లేక దళారులకే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకుంటూ దళాలు తమ ఇష్టం వచ్చిన ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతన్నలను ఆదుకోవాలి.

- రామచంద్రుడు, రైతు సంఘం నాయకులు.

కొనుగోలు కేంద్రాల ద్వారానే లాభం



15 ఎకరాల్లో సాగు చేయగా ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చింది. బస్తా రూ.1490కు అమ్మేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లాభం వస్తుంది. పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు లేక దళారులకే అమ్ముకోవడం జరుగుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం అవసరం. ప్రైవేటు వ్యక్తులకు ధాన్యాన్ని అమ్మినట్లయితే వారు డబ్బులు ఇవ్వక ఐపీ పెట్టి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితులను రైతులకు రాకుండా ప్రభుత్వం నియంత్రించాలి.

- మౌలాలి, రైతు, వెంగల్‌రెడ్డి పేట.


ఘనంగా రైతు సంఘం వార్షికోత్సవం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఎపి రైతు సంఘం 35వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నందికొట్కూరు మండలంలో, పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య కార్యాలయం దగ్గర రైతు సంఘం జెండాను రైతు నాయకుడు పిక్కిలి శ్రీనివాసులు ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు యన్.కృష్ణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకుడు కే భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు పి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎపి రైతు సంఘం నిరంతరం రైతుల సమస్యలపై దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. నందికొట్కూరు మండలంలో హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ఉన్నా ఈ మండలానికి, పట్టణానికి ఏమాత్రం కూడా ఉపయోగపడకుండా ఇతర ప్రాంతాలకే నీటిని తీసుకువెళుతున్నారని అన్నారు. రైతులు త్యాగం చేసి భూములను వదులుకున్న ఈ ప్రాంతానికి నీరు ఇవ్వడానికి పాలకులకు చేతకావడం లేదని విమర్శించారు. పక్కనే నాగటూరు-1, 2 ఎత్తిపోతల పథకాలు ఉన్న రైతులకు సరైన సమయంలో నీళ్ల అందక పంటలు ఎండిపోయి నష్టపోతున్నారని తెలిపారు. నందికొట్కూరు మండలంలోని ప్రతి ఎకరాకు సాగును ఇచ్చేంతవరకు ఉద్యమాలు నిర్వహించాలని ప్రతిజ్ఞ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రామకృష్ణ, వెంకటరమణ, శివన్న, సిఐటియు నాయకులు ఆంజనేయులు, గోపాలకృష్ణ, కెవిపిఎస్ నాయకులు కృపాకర్ తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** మిడుతూరు మండల కేంద్రంలో, చింతల పల్లె గ్రామంలో ఎపి రైతు సంఘం 35వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. నాయకులు బి.నారాయణ ఎఐకెఎస్ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథులుగా రైతు సంఘం జిల్లా నాయకుడు పి వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. మిడుతూరు మండలంలో వేల ఎకరాల మెట్ట భూములు ఉన్నాయని తెలిపారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను ఈ ప్రాంత వాసులకు ఉపయోగించక పోవడం మెట్ట రైతులకు అన్యాయం చేయడమే అన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా లింకు ఛానల్ ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసి మండలంలోని సగం గ్రామాలకు సాగు తాగునీటి ఇవ్వాలన్నారు. అలగనూరు రిజర్వాయర్ నుండి మరొక లిఫ్టు ఏర్పాటు చేసి సగభాగానికి నీరు ఇవ్వచ్చన్నారు. రాబోయే కాలంలో ఎత్తిపోతల పథక సాధనకు, అలగనూరు రిజర్వాయర్ కట్ట మరమ్మతులకు రైతులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు ఓబులేష్, సిఐటియు నాయకులు లింగస్వామి, రైతు సంఘం నాయకులు శివరాముడు, శుజ్ఞానం, రైతులు పాల్గొన్నారు.


మిడుతూరులో జెండావిష్కరణ చేస్తున్న నాయకులు

ఊటీని తలపిస్తూ... భారీగా పొగమంచు...


దుద్యాల గ్రామాన్ని కమ్ముకున్న పొగ మంచు

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలాన్ని మంగళవారం వేకువజామున పొగ మంచు కమ్మేసింది. పొగ మంచు కొన్ని గంటల వరకు కమ్ముకోవడంతో రహదారులు, పొలాలు పూర్తిగా కనిపించని పరిస్థితి ఏర్పడింది. పైనుంచి మంచు కురుస్తుందా అనే రీతిలో గ్రామాల్లో ఉన్న గృహాలు కూడా కనిపించకుండా పొగమంచు కమ్మేసింది. గువ్వలకుంట్ల పరిసర ప్రాంతంలో ఉన్న వరి పొలాల్లో పొగ మంచు కురుస్తున్న దృశ్యం కాశ్మీర్, ఊటి ప్రాంతాలను తలపించింది. వీరాపురం రహదారి వెంట పొగ మంచు కమ్మేయడంతో ఆటోలు, లారీలు, మోటార్ బైక్ వాహనదారులు చాలా నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుద్యాల గ్రామంలో పొగ మంచు చలి పెడుతున్నా ప్రజలు ఆరుబయటకు వచ్చి ఆ దృశ్యాన్ని ఆస్వాదించారు. ఏదేమైనప్పటికీ మండలంలోని పల్లెలు పొగ మంచుతో కమ్మేయడంతో కాశ్మీర్ లాంటి ప్రాంతాన్ని తలపించింది. **అవుకు :** మండలంలో దట్టమైన పొగ మంచు తెల్లవారుజామున కప్పుకుంది. ఎన్నడూ లేని విధంగా పొగ మంచు పట్టణాన్ని కప్పి వేయడంతో మనిషికి మనిషి కూడా కనిపించలేదు. తెల్లవారుజామున నాలుగు గంటల నుండి ఉదయము 9 గంటల వరకు పొగ మంచు కప్పుకపోవడంతో వాహనాలు లైట్ల వెలుతురులో వెళ్లాల్సి వచ్చింది. **ఆత్మకూర్ :** ఆత్మకూరు పట్టణ ప్రజలకు మంగళవారం ఉదయం ప్రత్యేక అనుభూతిని కలిగించిన సంఘటన చోటు చేసుకుంది. ఉదయం 5:30 నుండి దాదాపు 8 గంటల వరకు ఆత్మకూర్ పట్టణం పొగ మంచుతో కప్పుకుపోయింది. ఇంతవరకు ఇలాంటి సంఘటనలు చూడని ప్రజలు గృహాలపైకి ఎక్కి ప్రకృతిని ఆస్వాదించారు. పిల్లలు, పెద్దలు ఆనంద కేరింతలు కొడుతూ సంతోషంగా పొగ మంచును ఆస్వాదించారు. **కొలిమిగుండ్ల :** మండలంలోని పలు గ్రామాల్లో వేకువ జామున పొగ మంచు కమ్ముకుంది. కొన్ని గంటల వరకు రహదారులు, పొలాలు, గ్రామాలను పొగ మంచుతో నిండిపోయింది. ఒక్కసారిగా పైనుంచి మంచు కురుస్తుందా అన్న రీతిలో గ్రామాల్లో ఉన్న గృహాలు కూడా కనిపించకుండా పొగ మంచు కమ్మేసింది.


గువ్వలకుంట్లలో వరి పొలాల్లో పొగ మంచు


అవుకులో కమ్ముకున్న పొగ మంచు

29న మెగా రక్తదాన శిబిరం : ఆవాజ్

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహిస్తున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు అబుబకర్ కోరారు. మంగళవారం స్థానిక ముబారక్ షాదీఖానాలో పట్టణంలోని అన్ని మసీదుల మత పెద్దలు, మౌలివీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 సంవత్సరాల నుంచి ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. నందికొట్కూరు గవర్నమెంట్ ఆసుపత్రికి వచ్చే గర్భిణులు రక్తహీనతతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సహకారం అందించాలని కోరారు. ఖాజీ అబ్దుల్ రెహమాన్ మౌలానా, ఖాజీ జలాల్ మౌలానా, ఖాజీ ఇబ్రహీం మౌలానా, రఫీక్ మౌలానా తదితరులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేయడం ఎంతో పుణ్య కార్యక్రమమన్నారు. ప్రతి మసీదులో రక్తదానం విశిష్టత గురించి వివరించి రక్తదానం కార్యక్రమం విజయవంతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ డివిజన్ కార్యదర్శి అబ్దుల్ రెహమాన్, పట్టణ అధ్యక్షులు అబ్దుల్లా, కార్యదర్శులు రఫీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవాజ్ కమిటీ రాష్ట్ర నాయకులు అబూబకర్

పట్టుబడిన వాహనాలు వేలం

ప్రజాశక్తి - అవుకు

అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించారు. వాహనాల వేలంలో డోన్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లె. ఎక్సైంజ్ సిఐ సుభాషిని పాల్గొని మాట్లాడారు. వేలంలో 67 మంది పాల్గొన్నారని చెప్పారు. మొత్తం రూ. 7 లక్షల 90 వేలు ప్రభుత్వానికి ఆదాయం చేకూరిందని తెలిపారు. అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, బనగానపల్లె ఎస్సై శంకర్ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

సినీ నటుడు కృష్ణ మృతికి సిపిఐ సంతాపం

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

సుప్రసిద్ధ సినీనటుడు కృష్ణ మృతికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం చలన చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యంలో గ్రామ పెద్దలు, మత్స్యకారుల ఆధ్వర్యంలో వూరి ముందర చెరువులో తెప్పను వదిలారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ గంగమ్మ తల్లి అందరినీ చల్లగా చూడాలని ప్రతి ఏడాది ఈ విధంగా తెప్పోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఆయకట్టు రైతులు, పెద్దలు, గంగపుత్రులు రంగ రమేష్, ఇప్ప సుధాకర్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కర్నూలు రహదారిలోని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ సమీపంలోని సూర్య నగర్‌లో పగిడ్యాల గ్రామానికి చెందిన ఓగిలి శ్రీనివాసులు ఇంటిలో అక్రమంగా నిల్వ చేసిన 80 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్ఐ ఎన్‌వి.రమణ సింబ్బదితో కలిసి తనిఖీలు నిర్వహించి 40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యాపారిపై కేసు నమోదు చేశారు.

చందలూరులో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని చందలూరు గ్రామంలో పెద్ద సంజన్న (64) దారుణ హత్యకు గురైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సిరివెళ్ల సిఐ చంద్రబాబు నాయుడు వివరాల మేరకు.. చందలూరు గ్రామానికి చెందిన రామ పుల్లయ్య పొలం దగ్గర పనులు చేసుకుంటున్న సంజన్న దగ్గరకు వచ్చి పాత కక్షలు మనసులో పెట్టుకొని గొడవపడి హత్య చేసి అక్కడే ఉన్న కాలువలో పడవేశాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుని కోసం కోసం గాలింపు చేపట్టామన్నారు. సంఘటన స్థలాన్ని ఆళ్లగడ్డ డిఎస్పి సుధాకర్ రెడ్డి పరిశీలించారు. హత్య జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలాన్ని ఆళ్లగడ్డ సిఐ రాజశేఖర్ రెడ్డి, రుద్రవరం ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఆళ్లగడ్డ రూరల్ ఎస్సై నరసింహులు, పలువురు పోలీస్ సిబ్బంది పరిశీలించారు.

పేదల సొంతింటికల నెరవేర్చేందుకు కృషి

- టిడ్కో అపార్ట్ మెంట్లలో నివాసయోగ్యంగా అన్ని ఏర్పాట్లు సిద్ధం
- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణానికి సంబంధించి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు పదివేల టిడ్కో అపార్ట్మెంట్లను ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా పేదలకు నివాసయోగ్యంగా ఉండేందుకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే టిడ్కో అపార్ట్మెంట్లను, చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడ్కో అపార్ట్మెంట్లను పేదలకు కేవలం ఒక్క రూపాయికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. అయితే ఆ అపార్ట్మెంట్లలో నివాసయోగ్యంగా ఉండేందుకు అన్ని సౌకర్యాలు కల్పించే ఏర్పాట్లు చేస్తున్నామని, పనులు పూర్తయిన తర్వాత అప్పగించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ప్రస్తుతానికి 1300 ఇళ్లను సిద్ధం చేశామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు మాయమాటలు చెబుతూ వారు చేసినా హడావుడి అంతా ఇంతా కాదని, వారి గ్రాఫిక్‌లు, బొమ్మలను చూపించి ప్రజలను మోసం చేశారన్నారు. పేదవారి వాడలు అంటే మురికివాడలు కాదని మోడల్ టౌన్‌లుగా తీర్చిదిద్ది చూపిస్తామన్నారు. టిడిపి వారు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడానికి అడ్డుపడుతూ కోర్టులకు వెళ్లారన్నారు. అయితే కోర్టులోకి వెళ్లిన కేసులలో ఇప్పటికే మూడులో రెండు గెలిచామన్నారు. త్వరలో ఇళ్ళ స్థలాల కు కేటాయించిన ప్రాంతంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలను జారీ చేశారన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి అదిమూలపు సురేష్ చేతులమీదుగా పేదలకు ఇళ్లను అప్ప జెప్పే బృహత్తర కార్యక్రమాన్ని త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, కౌన్సిలర్ కలాం భాష, కోఆప్షన్ సభ్యులు సలముల్లా, వైసిపి నాయకులు టీవీ రమణ, మాజీ కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, దండే సుధాకర్, భాస్కర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఎస్ఈ రాజశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్


మాట్లాడుతున్న భూమా బ్రహ్మానందరెడ్డి

చంద్రబాబు పర్యటనను జయప్రదం చేయండి : భూమా

నంద్యాల అర్బన్ : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి నాయకులను, కార్యకర్తలను కోరారు. మంగళవారం టిడిపి నంద్యాల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెళ్ళ శ్రీరాములు, పట్టణ అధ్యక్షుడు ఖలీల్, మండల కన్వీనర్ గురునాథరెడ్డి, గోస్పాడు మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, నంద్యాల పట్టణ టిడిపి కౌన్సిలర్లు, ఇంచార్జీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

- సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్లు నిరసన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

క్లాప్ ఆటో డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, కనీస వేతనం తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వం ఇచ్చే వేతనాలలో కోత విధించరాదని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్‌లు డిమాండ్ చేశారు. కనీస వేతనం అమలు, వేతనాల్లో కోత విధించరాదని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు క్లాప్ ఆటోలను నిలిపి డ్రైవర్లు సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ఏజెన్సీలు క్లాప్ ఆటో డ్రైవర్లకు సరైన వేతనాలు చెల్లించకపోవడం, అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10,500 చెల్లిస్తే ఏజెన్సీలు మాత్రం ఆటో డ్రైవర్లకు కేవలం 8,270 రూపాయల మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. పది నెలలు అవుతున్నా పిఎఫ్ అమౌంట్‌ను చెల్లించడం లేదని, క్లాప్ ఆటో డ్రైవర్లకు ఏమైనా జరిగితే కుటుంబాలను ఆదుకునే పరిస్థితుల్లో ఎవరూ లేరని, ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో ఆటోలను నిలిపి ఆందోళనలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

రైతుల సేవలో సహకార సంఘాలు

- శిరివెళ్ల ప్రాథమిక వ్యవసాయ రైతు పరస్పర సహకార సంఘం చైర్మన్ రాజశేఖర్ రెడ్డి

శిరివెళ్ల : శిరివెళ్లలోని రైతు సేవ సహకార సంఘ సొసైటీ ప్రగతి పథంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నదని సొసైటీ చైర్మన్ ఎన్.రాజ శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సహకార సంఘం సొసైటీ ఆవరణంలో డైరెక్టర్‌లు, సిబ్బంది అధ్వర్యంలో 69వ సహకార వారోత్సవాల సందర్భంగా సహకార జెండా ఎగురవేసి ప్రసంగించారు. చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు ఆర్థిక రుణాలు విరివిగా అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి సహకారంతో శిరివెళ్ల సహకార సంఘ సొసైటీ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సిఈఓ మహబూబ్ భేగ్, నాగులయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



పేరుకే జగనన్న విద్యా కానుక

- ఐదు నెలలవుతున్నా అందని పాఠ్య పుస్తకాలు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆత్మకూర్

జగనన్న విద్యా కానుక పేరుకు, ఫోజులకు, గొప్పలు చెప్పుకోవడానికి మాత్రమే పరిమితమైందని, పాఠశాలలు, కళాశాలలు మొదలై ఐదు నెలలు కావస్తున్నా పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.దినేష్ కుమార్ విమర్శించారు. మంగళవారం స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు లేకపోతే విద్యార్థులు ఏ విధంగా చదువుకోవాలని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలను, మౌలిక సదుపాయాలు కల్పించడంలో, మెస్ చార్జీలను పెంచడంలో విఫలమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వచ్చే సంవత్సరానికి కూడా పాఠ్యపుస్తకాలను ఇప్పటికే అందుబాటులో ఉంచామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఈ సంవత్సరానికే ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలను అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పాఠశాల, కళాశాలల విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఎంఇఒ, ఆర్ఐఒ ఆఫీసులను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ప్రేమ్, నాయకులు ప్రతాప్, దిలీప్, రాజేష్, లింగేష్, సాయి, సుబ్బన్న , గంగాధర్, మాసుం వలి, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్



పిడిఎస్‌యు మహాసభను జయప్రదం చేయండి

డోన్: ఈ నెల 25, 26,27 తేదీలలో ఏలూరు పట్టణంలో జరుగు పిడిఎస్‌యు 21వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం డోన్ ప్రధాన కార్యదర్శి కే.పవన్ కోరారు. మంగళవారం కార్యాలయం ఆవరణంలో మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు అధ్యక్షుడు అమృత అర్జున్, నాయకులు రాజశేఖర్, రాఘవేంద్ర, మనోహర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు** : ఏలూరులో ఈ నెల 25, 26, 27వ తేదీలలో జరుగు పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలనికోరుతూ స్థానిక బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజీలో కరస్పాండెంట్ సూదిరెడ్డి రమేష్ రెడ్డి మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ జాన్ ఏలిశా బాబు, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది, డివిజన్ అధ్యక్షులు గణేష్, నాయకులు రమేష్, మహేంద్ర పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

గోస్పాడు : గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జూలపల్లి, పసురుపాడు గ్రామాలలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వాలంటరీలు మంగళవారం ఇంటి ఇంటికి తిరిగి సర్వే చేశారు. సర్వే వివరాలు వివరాలను క్షేత్రస్థాయిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ అడిగి తెలుసుకున్నారు.

'అలగనూరు' కట్ట మరమ్మతులు వేగవంతం చేయాలి : టిడిపి

మిడుతూరు : మండలంలోని అలగనూరు రిజర్వాయర్ కట్ట మరమ్మతు పనులను వేగవంతం చేయాలని టిడిపి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కుంగిపోయిన ప్రాంతాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వాయర్ ఆనకట్ట దాదాపు 100 మీటర్లు మూడు సంవత్సరాల నుండి కుంగిపోయిందని, ప్రభుత్వం దాదాపు 3 కోట్ల 60 లక్షల నిధులను కేటాయించిందని, అయితే సంబంధించిన కాంట్రాక్టర్లు పనులను వేగవంతం చేయకపోవడంతో గత మూడు సంవత్సరాల నుండి రైతాంగానికి వ్యవసాయానికి నీరు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అయితే వైసిపి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే రిజర్వాయర్లో దాదాపు 300 కుటుంబాల మత్స్యకారులు చేపలు పట్టి జీవనం గడిపేవారమని కొంతమంది మత్స్యకారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రిజర్వాయర్ మట్టి కట్టను త్వరగా పనులు పూర్తి చేసి రైతాంగానికి నీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఖాతా రమేష్ రెడ్డి, వంగాల శివరామిరెడ్డి, సుభాష్, రవీంద్రబాబు, తేనేటి మహేష్ రెడ్డి, సుధాకర్, కస్వా శంకర్ రెడ్డి, శేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గౌరుచరితా రెడ్డి

నవరత్నాలతో ప్రతి ఇంటా సంతోషం : ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

ప్రజాశక్తి - శిరివెళ్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న నవరత్నాల పథకాలు వల్ల ప్రతి ఇంటా సంతోషం వెల్లి విరుస్తున్నదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ఎంపిపి నాయక్ మహమ్మద్ వసీం, వైసిపి నాయకుల ఆధ్వర్యంలో రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** పట్టణంలోని 15వ వార్డులో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి, విజయ డైరీ మిల్క్ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి మూడున్నర సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ఎమ్మెల్యే వివరించారు. కేంద్ర కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ చింతకుంట్ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, వైకాపా మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాబులాల్, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, వరాలమ్మ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రమేష్ గౌడ్, వైకాపా నాయకులు ఆజాద్, సునీల్, మున్సిపల్ ఏఈ సురేంద్ర, శానిటరీ అధికారి బాలస్వామి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పాములపాడు :** మండలంలోని వేంపెంట గ్రామంలో రెండో రోజు గడపగడప కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ దృష్టికి ఎస్టీ కాలనీ వాసులు తాగునీటి సమస్యను తీసుకొచ్చారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు నా దృష్టికి ఎందుకు తేలేదని అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డబ్ల్యూఎస్ వెలుగోడు ఏఈతో ఫోన్లో మాట్లాడి వేంపెంటకు ఇవ్వాల్సిన నీటిని ఇతర గ్రామాలకు ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. అంతకుముందు ఎస్టీ కాలనీకి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. చెంచు గిరిజన గూడెంలో వారి జీవనస్థితిగతులను చూసి ఇళ్ల నిర్మాణాలకు ఆర్డిటి స్వచ్ఛంద సంస్థతో మాట్లాడతానని ఎమ్మెల్యే వారికి తెలిపారు. చెంచు కాలనీ వరకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు, నీటి కుళాయిలకు ప్రతిపాదనలను (ఎస్టిమేషన్) పంపాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగ శివ లీల, తహసీల్దార్ షానవాజ్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్ మాణిక్యమ్మ, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, వైసిపి రాష్ట్ర నాయకులు చెరుకుచర్ల రఘురామయ్య, మండల నాయకులు రామలింగేశ్వర రెడ్డి, డైరెక్టర్ రామసుబ్బయ్య, కో ఆప్షన్ నెంబర్ ముర్తుజా అలీ, నాయకులు చౌదయ్య, రమణారెడ్డి, భాస్కర్, దామయ్య, చలమారెడ్డి, రాజన్న, బంగారు భాష, ఉపేంద్ర, జబ్బార్, సర్పంచ్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** సిఎం జగన్మోహన్ రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు లాంటివని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు వివరిస్తూ, ప్రజల సమస్యలన్నీ అడిగి తెలుసుకున్నారు. పలుకూరు మెట్ట నుంచి రామకృష్ణాపురం గ్రామం వరకు రూ.1 కోటి 60 లక్షలతో నూతనంగా వేసిన తారు రోడ్డును, పలుకూరు గ్రామంలో రూ.5 లక్షలతో వేసిన సిసి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేష రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శివారెడ్డి వెంకట్రామిరెడ్డి, ప్రముఖ మైన్స్ వ్యాపారవేత్త శివరామిరెడ్డి, మండల కన్వీనర్ గుండం నాగేశ్వర రెడ్డి, రామకృష్ణాపురం నాయకులు నాగేంద్ర,గోపాల్ రెడ్డి, మధు, చంద్ర, బాలాజీ, ఎస్.మధు, కాంట్రాక్టర్ మంగళవరపు శివరామిరెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పిటిసి శ్రీరామ రెడ్డి, ఎంపిపి గోకుల్ లక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, పుల్లారెడ్డి, భువనేశ్వర రెడ్డి, సర్పంచి మహేంద్రమ్మ పేర్కొన్నారు. మెట్టుపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ లబ్ధి పొందిన ప్రజలకు పథకాల గురించి వివరించారు. సురేంద్రనాథరెడ్డి, తహసీల్దార్ శివారాముడు, ఎంపీడీవో వజీర్ రహిమాన్, చంద్ర శేఖర్‌రెడ్డి, పిఆర్ ఏఇలు ప్రభాకర్ రెడ్డి, రవికుమార్, ఆర్‌ఎ హేమంత్,ఎ ఇ, ఎం ఇఒ శ్రీనివాసులు, వినయ్, ఏపిఎం క్రిష్ణమూర్తి, బోరా మల్లికార్జున రెడ్డి, రామంజీ, బోరెడ్డి రాము, ప్రభాకర్ రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, మోహన్, విష్ణువర్ధ రెడ్డి, విష్ణు, రఘు, వలి పాల్గొన్నారు. **వెలుగోడు :** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మదార్ ఖాన్ వీధి, అరుగులు, ఆసార్ వీధి, షేర్ అహమ్మద్ వీధి, మంచినీళ్ల బావి వీధిలలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వాలంటరీ, సచివాలయాల సిబ్బందిల వ్యవస్థ తీరు పై ప్రజలలో స్పందనపై ఆరా తీశారు. అనంతరం ఫ్లాష్ మసీదు నిర్మాణం పరిశీలించారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి కాంట్రాక్టర్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, అడ్వకేట్ ఆసిఫ్ అలీ ఖాన్ అధికారులు ఎంపీడీవో అమానుల్లా, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ శ్రీను, విద్యుత్ శాఖ ఏఈ రవీంద్ర నాయక్, ఎంపిపి రమేష్, సర్పంచ్ జయపాల్, వైస్ ఎంపిపిలు ఎంపిటీసీలు చికెన్ బాబు, శంకర్ నాయక్, ఎంపిటీసీ ఫ్రూట్ చాంద్, మదీనా షంషీర్ పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు హరిజనపేటలో మాజీ కౌన్సిలర్లు ముస్తయ్య, కన్నమ్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నాయకులు ఎర్రన్న, సాయిబాబా, బాబు, శేఖర్, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.


ప్యాపిలి మండలంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న వైసిపి నాయకులు


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గ్రంధాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని గ్రంధాలయంలో 55వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం పుస్తక ప్రదర్శన చేపట్టారు. గ్రంధాలయాధికారి రామచంద్రుడు మాట్లాడుతూ గ్రంధాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. విశ్రాంత ఉద్యోగులకు భక్తి పుస్తకాలు, పురాణాల పుస్తకాలు పుస్తక ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది లాలయ్య, పాఠకులు అన్వర్, వెంకటేశ్వర్లు, గఫార్, రఘునాథ రెడ్డి, రాజారెడ్డి, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** గ్రంధాలయాలలోని పుస్తకాలను, కవులు రచించిన కావ్యాలు, గ్రంథాలను చదివి మేధావులు కావాలని గ్రంథాలయ అధికారి ఈ.మధు అన్నారు. స్థానిక బుగ్గారెడ్డి రీడింగ్ రూమ్ గ్రంథాలయంలో పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు నాగమోహన్, నాగమధు, నూర్ హమద్, బాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బనగానపల్లె : పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని సంపాదించవచ్చని రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శనను గ్రంధాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రియదర్శిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంధాలయ పాఠకులు, బిడిసిసి సిబ్బంది భాస్కర్ రెడ్డి, మదన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. **నంద్యాల :** నంద్యాల శాఖ గ్రంధాలయం లో మంగళవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పంచాయితిరాజ్ విశ్రాంత ఉద్యోగి పుల్లయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రంథలయాధికారి రాధా బాయి, మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు శివలక్ష్మి , విద్యార్థులు, గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు. **డోన్ :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేటలో హెచ్ఎం పద్మావతమ్మ అధ్యక్షతన పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఎం.వెంకట సుబ్బారెడ్డి, సి.దేవేంద్రప్ప, రాఘవేంద్ర, లీలావతమ్మ తదితరులు పాల్గొన్నారు. **జూపాడుబంగ్లా :** స్థానిక గ్రంధాలయంలో లైబ్రేరియన్ ఎన్. స్రవంతి ఆధ్వర్యంలో గ్రంధాలయ వారోత్సవాలు నిర్వహించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** ప్రతి విద్యార్థి ప్రతి రోజూ గ్రంధాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకునే అలవాటు చేసుకోవాలని గ్రంధాలయాధికారిని కె మద్దమ్మ అన్నారు. పగిడ్యాల గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన కార్యమ్రాని నిర్వహించారు. విద్యార్థులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పుస్తక పఠనంతో జ్ఞాపకశక్తిని పెంపొందించు కోవచ్చని మండల విద్యాధికారి తిమ్మారెడ్డి పేర్కొన్నారు. శాఖా గ్రంధాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన కార్యక్రమంను గ్రంధాలయ ఇన్చార్జి పి. రామదాసు పర్యవేక్షణలో ఎంఇఒ తిమ్మారెడ్డి ప్రారంభించారు. జగన్, రాధాకృష్ణమూర్తి, నాగయ్య, రజియా, పాఠకులు పాల్గొన్నారు.


కోవెలకుంట్ల గ్రంధాలయంలో పాల్గొన్న ఎంఇఒ, పాఠకులు

అంగన్వాడీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

- ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి లీలావతి



ఆళ్లగడ్డ : గర్భిణీలు, బాలింతలు, చిన్నారులలో రక్తహీనత, పౌష్టికాహార లోప రహిత సమాజ నిర్మాణంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సమన్వయంగా విధులు నిర్వహించి అవసరమైన వారికి పౌష్టిక ఆహారం అందజేయడంలో ముందుండాలని నంద్యాల జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని లీలావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆవుల భాస్కర్ రెడ్డి ఆడిటోరియంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని తేజేశ్వరి ఆధ్వర్యంలో మిషన్ రిచ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సునిర్వ హించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎంలు, హెల్త్ సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు. ప్రజల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సోషల్ బిహేవరల్ చేంజ్ కో- ఆర్డినేటర్ విజయ్ సూపర్వైజర్లు పద్మావతి, సుశీల, దస్తగిరమ్మ, హెల్త్ ఎడ్యుకేషన్ సరోజ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం మహాసభను జయప్రదం చేయండి

బండి ఆత్మకూర్ : ఈ నెల 20, 21, 22వ తేదీల్లో చిలకలూరిపేటలో జరిగే కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ కోరారు. మంగళవారం బండి ఆత్మకూరులో కౌలు రైతు సంఘం జెండాను మండల అధ్యక్షులు పుల్లయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా సబ్సిడీ ఎరువులు, సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంక్షేమం కోసం జరిగే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, నాయకులు ఓబులేసు, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** రైతు వ్యతిరేకమైన నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 21, 22 తేదీన పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటలో కౌలు రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభ సందర్భంగా మండలంలోని లింగాల పాములపాడు నాగంపల్లి గ్రామాలలో రైతు సంఘం జెండాను ఎగరవేశారు. ఎస్ఆర్ రమణ, పురుషోత్తం, రవణమ్మ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూ. 6 లక్షల విలువైన మహాలక్ష్మి హారం విరాళం

ఆళ్లగడ్డ : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని బళ్ళారికి చెందిన కాంట్రాక్టర్ భూపాల్ రెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. కార్తీక మహోత్సవం సందర్భంగా ఆరు లక్షల రూపాయల విలువగల బంగారు మహాలక్ష్మి హారాన్ని 46వ పీఠాధిపతి శ్రీ రంగనాథ యతీంద్ర మహా దేశికన్ స్వామికి అందచేశారు. పీఠాధిపతి దాతలను ఆశీర్వదించారు. మఠం ప్రధాన అర్చకులు వేణు గోపాలన్ ఉన్నారు.

స్వర్ణ మాలోల నరసింహ స్వామికి పూజలు : అహోబిలం మఠంలో ఉండే శ్రీ మాలోల నరసింహ స్వామికి మఠం 46వ పీఠాధిపతి స్వామి పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి అహోబిలం నుండి హైదరాబాద్‌లోని అహోబిల మఠానికి తరలి వెళ్లారు.

వారం, ట్రేడ్ లైసెన్స్ జాబితాను సిద్ధం చేయాలి

నంద్యాల కలెక్టరేట్ : వారం, ట్రేడ్ లైసెన్స్ జాబితాను సిద్ధం చేయాలని, పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవి చంద్రారెడ్డి మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌తో కలిసి హెల్త్ ఆఫీసర్ శానిటరీ ఇన్స్పెక్టర్స్‌తో లైసెన్స్‌లు, శానిటేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల పరిధిలోని అన్ని షాపులకు ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాను వారంలోగా సిద్ధం చేయాలన్నారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకొని వారు తప్పనిసరిగా చేయించాలని సూచించారు. డ్రైయినేజీ సమస్య వున్న చోట కొత్తగా నిర్మించాలన్నారు. వీధులలో పందులు, కుక్కల బెడద లేకుండా చూడాలన్నారు. రోడ్ల డివైడర్స్ పక్కన ఉన్న మట్టిని తొలగించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్, బ్యానర్స్ అమలు అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. క్లాప్ శానిటేషన్ ఇంప్రూవ్మెంట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న క్రీడా సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూరు : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 21న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాల పోస్టర్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21, 22న స్థానిక గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో కెవికె క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ నియోజకవర్గ జట్ల ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. నంద్యాల జిల్లా క్రీడల అధికారి ఎంఎన్‌వి.రాజు, ఫెన్సింగ్ కోచ్, ఇతర నియోజకవర్గ ఇన్చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నేత కాంపౌండ్ వాల్ కూల్చివేత

- మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్‌ను టార్గెట్ చేసి వేధింపులు
- మంత్రి అరాచకాలకు ప్రజలు బుద్ధి చెప్తారు
- డోన్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని ఓనైరో స్కూల్ సమీపంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ టిడిపి నేత మురళీకృష్ణ గౌడ్‌ను అధికార పార్టీకి చెందిన కీలక మంత్రి టార్గెట్ చేశారు. మంగళవారం టిడిపి నేత కాంపౌండ్ వాల్ ను కూడా అధికారులు జెసిబితో కూల్చివేశారు. నియోజకవర్గ టిడిపిలో మురళీకృష్ణ గౌడ్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. టిడిపి ఇన్‌ఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డికి కుడి భుజంగా ఉన్నారు. అంతేకాక డోన్‌లో గతమే నెలలో పర్యటించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మురళీకృష్ణ గౌడ్ ఇంటికి వచ్చి తేనేటి విందు స్వీకరించారు. అదేవిధంగా టిడిపి కార్యాలయానికి మురళీకృష్ణగౌడ్ తన కాంప్లెక్స్‌ను ఇచ్చారు. దీంతో కీలక మంత్రి టిడిపి నేత మురళీకృష్ణ గౌడ్ ఆస్తులను టార్గెట్ చేశారు. ఆయనకు సంబంధించిన వెంచర్లో ఏర్పాటుచేసిన కాంపౌండ్ వాల్ నిబంధనలకు విరుద్ధంగా ఉందని కూడా అధికారులతో నోటీసులు ఇప్పించారు. మంగళవారం ఉదయం పోలీసు బలగాలతో కూడా అధికారులు జెసిబితో వెంచర్ వద్ద వాలిపోయారు. కాంపౌండ్ వాల్ కూల్చి వేతను టిడిపి శ్రేణులు అడ్డుకున్నారు. అయితే చివరకు పోలీస్ బందోబస్తు నడుమ కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారు. అధికారపార్టీ చేస్తున్న అరాచకాలకు ప్రజలే బుద్ధి చెబుతారని టిడిపి ఇన్‌ఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి హెచ్చరించారు. వైసిపి నాయకుల అక్రమ నిర్మాణాలు కూడా అధికారులకు కనిపించవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

నాడు-నేడు పనులను పూర్తి చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆత్మకూర్

మనబడి నాడు-నేడు కింద చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ మోహన్ కుమార్, ఎంఇఒ జానకిరామ్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో నాడు-నేడు కింద నిధులు మంజూరైన పాఠశాలల హెచ్ఎంలు, సంబంధిత ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 39 పాఠశాలలకు నాడు-నేడు కింద నిధులు విడుదల అయ్యాయని, పనులు నత్తనడకన జరగడం సరైనది కాదన్నారు. నిర్దేశించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఫేస్-2 కింద ఇప్పటికే దాదాపు రూ. 2 కోట్ల 20 లక్షల దాకా నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1 కోటి 40 లక్షల రూపాయల మేర ఖర్చు జరిగినట్లు చెప్పారు. మిగతా నిధులను ఖర్చు అయ్యే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం ఉమామహేశ్వరి, పాఠశాలల హెచ్ఎంలు, సిఆర్‌పిలు, ఇంజనీర్లు పాల్గొన్నారు. **పగిడ్యాల :** నాడు-నేడు పనులను పారదర్శంగా నిర్వహించాలని ఎంపిడిఒ వెంకటరమణ, ఎంఇఒ సుభాన్ ఇంజనీర్లకు సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడారు. నాడు-నేడు పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. నాణ్యత లోపిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయితీ ఎఇ వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు, సిఆర్‌పిలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఇంజనీర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎంపిడిఒ మోహన్ కుమార్


బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ షేక్షవలిరెడ్డి

జాతీయస్థాయి బాలోత్సవ్‌లో గురురాజా విద్యార్థుల ప్రతిభ

నంద్యాల : గుంటూరు నగరం నంబూరులో జరిగిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వివిఐటి బాలోత్సవ్-2022 పోటీల్లో నంద్యాల ఎన్జీవో కాలనీలోనిశ్రీ గురు రాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి ఏకంగా 36 బహుమతులు సాధించారని పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరిరెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విజేతలకు జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు లఘు చలనచిత్ర విశ్లేషణ సీనియర్ విభాగంలో యం. నవీన్ ప్రథమ స్థానం, ఏ మదన్ మోహన్ ద్వితీయ స్థానం, జూనియర్ విభాగంలో ఏ.హర్షిత, స్పెషల్ జ్యూరీ కథా విశ్లేషణ జూనియర్ విభాగంలో ఇ.వనిత, ఏ హర్షిత, సీనియర్ విభాగంలో, బి.అమృత ప్రథమస్థానం, ఏ.మదన్మోహన్ కన్సలేషన్ స్థానాన్ని సాధించారని చెప్పారు. అలాగే డ్రాయింగ్, కవితా రచన, డిజిటల్ డ్రాయింగ్, వక్తృత్వ, ఏక పాత్రాభినయనం, శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇలా వివిధ రకాల విభాగాలలో 37 బహుమతులు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులకు చక్కని శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందాన్ని డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

కొత్తపల్లి : గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు ఇంటి పన్ను కట్టించే కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. మంగళవారం కొత్తపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు ప్రతి అధికారి సంబంధిత సచివాలయంలో వేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు అందరికీ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'గడప గడప'కు సిద్ధంగా ఉండాలి : ఎంపిడిఒ

కొలిమిగుండ్ల : మండలంలోని చింతలాయపల్లి గ్రామ సచివాలయ పరిధిలో త్వరలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు సచివాలయ ఉద్యోగులు సిద్ధంగా ఉండాలిన ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. మంగళవారం చింతలయపల్లెలోని సచివాలయం నందు ఎంపీడీవో సుబ్బరాజు, వైసీపీ మండల కన్వీనర్ అంబటి గురువు రెడ్డి సచివాలయ ఉద్యోగులతో, వాలంటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు తమ శాఖల నివేదికలతో, వాలంటీర్లు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి తాహెర్ హుస్సేన్, వైసిపి నాయకులు జయరామ కృష్ణ, పంచాయతీ సెక్రటరీ వెంకట సుబ్బయ్య, వీఆర్వో సత్య నారాయణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోండి

సంజామల : మండలంలోని అన్ని గ్రామాల రైతులు శనగ, జొన్న, మిరప పంట వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ వ్యవసాయ పథకాలు లబ్ధి చేకూరాలంటే తప్పనిసరిగా ఈక్రాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటిన ప్రియదర్శిని విద్యార్థి

బనగానపల్లె : పట్టణంలోని ప్రియదర్శిని ఉన్నత పాఠశాల విద్యార్థి విష్ణుకుమార్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటి మెమెంటో, పతకాన్ని సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కేసర్లింగ్ మంగళవారం తెలిపారు. విష్ణు కుమార్‌ను క్రీడల్లో ప్రోత్సహించేందుకు కరస్పాండెంట్ రూ.5 నగదు బహుమతి అందజేశారు. విష్ణుకుమార్‌ను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

చెత్తను సంపదగా మార్చుకోవాలి : ఇఒఆర్‌డి

బండి ఆత్మకూర్ : గ్రామ పంచాయతీలు చెత్తను సంపదగా మార్చుకోవాలని ఇఒఆర్‌డి శ్రీనివాసులు సర్పంచులకు సూచించారు. మంగళవారం కాకునూరు గ్రామ పంచాయతీలో ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డు ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని జెసిబి సహాయంతో సర్పంచి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా చేపడుతున్నామని తెలిపారు. ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ వద్ద వేరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌సభ పతాకావిష్కరణ

జూపాడుబంగ్లా : స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతి సందర్భంగా జూపాడుబంగ్లాలో కిసాన్‌సభ పతాకాన్ని రైతు సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల ఏసన్న మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కౌలు రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సహాయ కార్యదర్శి ఎం సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసులు, ప్రజాశక్తి ఇంచార్జ్ హనుమంతు హాజరై మాట్లాడారు. అఖిల భారత కిసాన్‌సభ 35వ జాతీయ మహాసభ డిసెంబరు 13 నుండి 16వ తేదీ వరకు కేరళలోని త్రిసూర్‌లో జరగనుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మదార్ సాహెబ్, లింగన్న, లింగస్వామి, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సమాజ అభివృద్ధికి మూలం

ఆత్మకూర్ : సైన్స్ మానవ ప్రగతికి, సమాజ అభివృద్ధికి మూలమని, సైన్సు ప్రజల అభివృద్ధి కోసం వినియోగించు కోవాలని జెవివి జిల్లా కార్యదర్శి ఎం.జనార్ధన్ రావు, మండల అధ్యక్షులు కె.రామారావు అన్నారు. మంగళవారం జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులను డి పాల్ హైస్కూల్‌లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలు నిత్యం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అశోక్ ఆనంద్, ఉపాధ్యాయులు అహ్మద్ హుస్సేన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం ఇవ్వాలి : ఎఐకెఎస్

బేతంచర్ల : అతివృష్టి, అనావృష్టి వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐకెఎస్ రాష్ట్ర నాయకులు ఎన్ వెంకటకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు వి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రైతు సంఘం నాయకులు రహమతుల్లా ఆధ్వర్యంలో వారు ఏఐకెఎస్ జెండా ఆవిష్కరించారు. ఈశ్వర్ రెడ్డి, రాముడు, వెంకటరమణ, మల్లికార్జున, మద్దిలేటి, సుబ్బరాయుడు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

3 తులాల బంగారు గొలుసు విరాళం

బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానానికి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విలువైన మూడు తులాల బంగారాన్ని విరాళంగా ఇచ్చినట్లు ఇఒ రామానుజన్ మంగళవారం తెలిపారు. ఏకముఖి రుద్రాక్ష కలిగిన బంగారు గొలుసును ఆలయ వేదపండితులు, అర్చకులకు అందించారు. అనంతరం బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి దంపతులు చౌడేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా సత్కరించారు.

మహిళలు స్వయం ఉపాధితో రాణించాలి

డోన్ : మహిళలు స్వయం ఉపాధితో రాణించాలని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జాడీల ఫ్యాక్టరీ ఆవరణంలో మహిళలకు కుట్టు మిషన్ ఉపాధి శిక్షణ కేంద్రంలో రెండో బ్యాచ్ తీసుకుంటున్న మహిళలకు స్టిచ్చింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు ఆర్ట్.రమణ, విమల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఆళ్లగడ్డ : జగనన్న క్రీడా సంబరాలు కార్యక్రమంలో భాగంగా ఏపీ సీఎం స్పోర్ట్స్ ప్రైస్ మినీ టోర్నమెంట్‌లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఎంపిక పోటీలు స్థానిక పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో సుమారు 150 మంది క్రీడాకారులు మూడు క్రీడాంశాలలో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో ఆళ్లగడ్డ నియోజకవర్గం తరఫున పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను స్థానిక శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శోభా వివేకవతి, హెచ్ఎం ఆదిలక్ష్మి, నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఏ శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.